సాక్షి
సంగారెడ్డి
ఆదివారం । 1 । జూన్ । 2025

సండే స్పెషల్

భవన నిర్మాతలు

ఒక్కో ఊరికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ఒక ఊరు సైనికుల నెలవైతే, మరొకటి ఉద్యోగుల కొలువుగా ఆదర్శంగా నిలుస్తుంది. అలాగే భవన నిర్మాతల అడ్డాగా వర్గల్ మండలంలోని అనంతగిరిపల్లి విలసిల్లుతుంది.. ఏ ఇంట చూసినా శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతీకగా శ్రమశక్తిని ధారబోసే మిల్లర్లు, తాపీ మేస్త్రీలు, భవన నిర్మాణ రంగ కార్మికులే కన్పిస్తారు. ఆ ఊరి 'భవన నిర్మాతల'పై ప్రత్యేక కథనం.. 8లో – వర్గల్(గజ్వేల్)



న్యూస్‌రీల్

ఏషియన్ అథ్లెటిక్స్‌లో నందినికి స్వర్ణ పతకం



స్వర్ణ పతకం సాధించిన అగసర నందిని

మునిపల్లి(అందోల్) : దక్షిణ కొరియాలోని గుమి వేదికగా మే 27 నుంచి 31వరకు జరిగిన ఏషియన్ అథ్లెటిక్స్ మహిళల చాంపియన్ షిప్ పోటీల్లో బుదేరా సాంఘిక సంక్షేమ రెసిడెన్సియల్ కళాశాలకు చెందిన అగసర నందిని స్వర్ణ పతకం సాధించింది. హెప్టాథ్లాన్ విభాగంలో నందిని 5,941 పాయింట్లతో స్వర్ణ పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అగసర నందినిని కళాశాల అధ్యాపక బృదం, తోటి విద్యార్థులు అభినందించారు.

అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తాం



భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న గూడెం మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస‌నగర్ కాలనీలో శనివారం రూ.కోటి 50లక్షల వ్యయంతో చేపట్టిన భూగర్భడ్రైనేజీ పైపులైన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జీహెచ్ఎంసీ పరిధిలోని పటాన్‌చెరు, భారతినగర్, రామచంద్రాపురం డివిజన్లను కోట్లాది రూపాయాల వ్యయంతో అభివృద్ధి చేశామన్నారు. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరించడంలో ముందుంటామని స్పష్టం చేశారు.

'సర్దుబాటు' జీవోను పునఃపరిశీలించాలి

తపస్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి



సమావేశంలో మాట్లాడుతున్న దత్తాత్రి

జహీరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలని, అభ్యాసన సామర్థ్యాలను పెంచుకునేందుకు ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని చెప్పిన అధికారుల వ్యవహారం అందుకు భిన్నంగా ఉందని తపస్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి పేర్కొన్నారు. జహీరాబాద్‌లో శనివారం జరిగిన తపస్ డివిజన్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల సర్దుబాటు పేరిట ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులను లేకుండా చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సత్వరమే సర్దుబాటుకు సంబంధించినటువంటి ఉత్తర్వులను పునఃపరిశీలించుకోవాలని సూచించారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



జెండాను ఆవిష్కరించిన నాగేశ్వరరావు

జిన్నారం (పటాన్‌చెరు): మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గడ్డపోతారం మున్సిపాలిటీ కార్మికుల నూతన యూనియన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రెండు నెలలుగా జీతాలు రాక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. జూన్ 9 న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు జయరాం, ఆనంద్, సురేందర్ రెడ్డి, రాజు, రామచంద్రారెడ్డి, భాస్కర్, యాదగిరి, నర్సింహులు, మల్లేష్, మహేందర్, నరేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సింగూరులోకి వరద

రెండో రోజు 1,366 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



సింగూరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. రెండో రోజు డ్యాంలోకి 1,366 క్యూసెక్కుల నీరు చేరింది. మహారాష్ట్రలోని లాతూర్ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు మంజీరా నదిలోకి వరదలు వస్తున్నాయి. ఆ నీరు డ్యాంలోకి చేరుతుందని డ్యాం అధికారులు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. శుక్రవారం డ్యాంలోకి 4,316 క్యూసెక్కుల నీరు చేరిందని తెలిపారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 29.917 టీఎంసీలకు...ప్రస్తుతం 17.478 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

పుల్‌కల్(అందోల్):

అలసత్వంపై అసహనం

- ధాన్యం సేకరణలో అధికారుల నిర్లక్ష్యంపై ప్రజాప్రతినిధుల మండిపాటు
- మా ఫోన్లకే స్పందించకపోతే రైతుల పరిస్థితి ఏంటీ?
- తరుగు దోపిడీపై చర్యలెందుకు తీసుకోవడం లేదని నిలదీత



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో మంత్రి దామోదర, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ధాన్యం సేకరణ విషయంలో అధికారుల తీరు పట్ల ప్రజాప్రతినిధులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చేందుకు ప్రయత్నిస్తే తమ ఫోన్లకు స్పందించకపోతే, సాధారణ రైతుల పరిస్థితి ఏంటని అధికారులను నిలదీశారు. కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో విచ్చల విడిగా కొనసాగుతున్న దోపిడీని అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటని.. దోపిడీ చేస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఉమ్మడి మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు, వ్యవసాయం, వర్షాకాల ముందస్తు ప్రణాళిక, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి తదితర అంశాలపై మంత్రులు కొండాసురేఖ, దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం తదితర ప్రజాప్రతినిధులు ఈ సమీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ధాన్యం సేకరణ విషయంలో అలసత్వంపై అధికారుల ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా కొండా సురేఖ కలుగజేసుకుని అధికారుల తీరు మార్చుకోవాలని సూచించారు.

చివరిగింజ వరకు కొనుగోళ్లు: మంత్రి కొండా

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, చివరిగింజ వరకు సేకరణ కొనసాగుతుందని మంత్రి కొండాసురేఖ పేర్కొన్నారు. ప్రజాప్రభుత్వంలో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. ధాన్యం పండించడంలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని చెప్పారు. రాష్ట్రం నుంచి ఇతర దేశాలకు బియ్యం ఎగుమతి అవుతున్నాయని పేర్కొన్నారు. సన్నాల కు బోనస్, ఇందిరమ్మ ఇండ్లు వంటి సంక్షేమపథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు.

మీడియాను అనుమతించని అధికారులు..

ఇద్దరు మంత్రులు సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్షించే కీలక సమావేశానికి అధికార యంత్రాంగం మీడియా ప్రతినిధులను అనుమతించకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాల అమలు తీరుపై జరిగే అన్ని జిల్లాల్లో ఈ సమీక్షలు జరుగుతున్నాయి. కానీ ఎక్కడా లేనివిధంగా సంగారెడ్డిలో జరిగిన సమీక్షను మీడియాను అనుమతించకపోవడం గమనార్హం. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు మీడియాకు అనుమతి లేదని జిల్లా పౌరసంబంధాల అధికారి ఏడుకొండలు తెలిపారు. విజువల్స్, ఫొటోలు తీసుకునేందుకే అనుమతి ఉందని తేల్చిచెప్పారు. సమీక్షలో మూడు జిల్లాల కలెక్టర్లు వల్లూరు క్రాంతి, రాహుల్‌రాజ్, మనుచౌదరి, ఆయా జిల్లాల వివిధశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఎల్లమ్మగూడలో ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేసిన కాంగ్రెస్ నాయకులు

ఇందిరమ్మ ఇళ్లలో ప్రొటోకాల్ రగడ

- ఎమ్మెల్యే సునీతారెడ్డి వర్సెస్ కాంగ్రెస్ నాయకులు
- హత్నూర మండలం ఎల్లమ్మగూడలో ఉద్రిక్తత

హత్నూర(సంగారెడ్డి): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనుల శంకుస్థాపనలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే సునీతారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పోటాపోటీగా పాల్గొనడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ ఘటన హత్నూర మండలం ఎల్లమ్మ గూడ గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ కాంగ్రెస్ వర్గీయులు తమ తమ నాయకులను ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం భూమి పూజ కోసం ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ తమ వర్గం మండల స్థాయి నాయకులతో ఎల్లమ్మగూడ గ్రామానికి చేరుకుని ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే సమయంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి గ్రామానికి చేరుకుని ప్రొటోకాల్ ప్రకారం తాను ఎమ్మెల్యేనని, తాను చేయాల్సిన పనులు ఇతరులు చేస్తే ఎలా ఊరుకుంటామన్నారు. ఎవరు చేపట్టినా ప్రభుత్వ నిధుల నుంచే మంజూరు చేస్తారు గానీ, సొంత డబ్బులు ఇవ్వరని చెప్పారు. ప్రొటోకాల్ ప్రకారం తాను ఎమ్మెల్యేనని, తానే పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే తేల్చి చెప్పారు. దీంతో బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకులు ఒకరికొకరు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇరు వర్గాల ఘర్షణతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తాను ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేను తాను తలచుకుంటే ఇందిరమ్మ ఇండ్లు బిల్లులు వస్తాయా అంటూ ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ క్రమంలో ఎస్సై శ్రీధర్‌రెడ్డి పోలీసు బలగాలతో ఇరువర్గాలకూ నచ్చజెప్పి వారిని శాంతింపజేశారు. కార్యక్రమాలలో ఇరు వర్గాల మండల స్థాయి నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు మండల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సహజమే

ఎస్పీ పరితోశ్ పంకజ్

సంగారెడ్డి జోన్: ఉద్యోగ జీవితంలో ప్రతీ ఒక్కరికి పదవీ విరమణ సహజమేనని జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన పలువురు పోలీసు అధికారులకు ఎస్పీ కార్యాలయంలో వారికి సన్మానించి, అభినందించారు. పదవీ విరమణ పొందిన వారిలో ఎస్ఐలు విఠల్, సుదర్శన్, ఏఎస్ఐలు రాజేందర్‌రెడ్డి, విలియం కెన్వెల్కర్ ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..కానిస్టేబుల్స్‌గా జిల్లా పోలీసు శాఖలో నియామకమై 42 ఏళ్లుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో వివిధ స్థాయిలలో సమర్థవంతంగా విధులను నిర్వహించారని కొనియాడారు. రిటైర్మెంట్ అనంతరం పోలీసు శాఖ నుంచి రావలసిన అన్ని రకాల ప్రయోజనాలను సకాలంలో అందేవిధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావ్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కల్యాణి, ఆఫీస్ సూపరింటెండెంట్ అశోక్, లాలూ నాయక్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ఐ.రామారావ్ తదితరులు పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన వారిని సన్మానించిన ఎస్పీ పరితోశ్ పంకజ్

రైల్వే సమస్యలు పరిష్కరించండి

కేంద్రమంత్రి సోమన్నకు ఎంపీ రఘునందన్‌రావు వినతి



కేంద్రమంత్రి సోమన్నకు స్వాగతం పలుకుతున్న ఎంపీ రఘునందన్‌రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నియోజకవర్గంలో నెలకొన్న రైల్వే సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేంద్ర రైల్వే సహాయమంత్రి వి.సోమన్నను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కోరారు. శనివారం కర్ణాటకలోని బీదర్ వెళ్తున్న సోమన్న ఎంపీ రఘునందన్‌రావు విజ్ఞప్తి మేరకు తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లి రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. కొల్లూరు, వెలిమెల మధ్యలోని రైల్వే లైన్‌పై నిర్మిస్తున్న బ్రిడ్జిను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ వంతెన పనులు నత్తనడకన సాగుతున్నాయని పనులను వేగవంతం చేయాలని ఎంపీ కేంద్రమంత్రికి వివరించారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో అనేక కొత్త కాలనీలు వస్తున్నాయని దానిని దృష్టిలో పెట్టుకుని రైల్వే సేవలను మరింత పెంచాలని కోరారు. ఈ ప్రాంతంలో నూతనంగా ఆర్‌యూబీ నిర్మాణానికి అనుమతినివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్రమంత్రికి ఎంపీ రఘునందన్‌రావు వినతి పత్రం అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు

రెండు రకాల ప్యాకేజీలు ప్రకటించిన ఐఆర్‌సీటీసీ

సంగారెడ్డి జోన్: తెలుగు రాష్ట్రాల ప్రజలు తీర్థయాత్రలకు వెళ్లే వారిని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ ప్రత్యేక ప్యాకేజీలను కల్పించింది. ఈనెల 14 నుంచి జూలై 13 వరకు రెండు ప్యాకేజీలుగా ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ రైళ్ల హైదరాబాద్ నుంచి ప్రారంభించనున్నట్లు ఐఆర్‌సీటీసీ పర్యాటక శాఖ జనరల్ మేనేజర్ డీఎస్‌జీపీ కిషోర్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

ప్యాకేజీ 1: గంగా రామాయణ పుణ్య క్షేత్రయాత్ర

ఈ యాత్రలో (కాశీ)వారణాసి, అయోధ్య, నైమిశారణ్య, ప్రయాగరాజ్, శృంగవర్పూర్ ప్రాంతాలు దర్శించుకోవచ్చు. ఈ యాత్ర ఈనెల 14న ప్రారంభమై 22వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈ ప్యాకేజీలో ప్రయాణించే ఒక్కొకరికి సాధారణ టికెట్ రూ.16,200, థర్డ్ ఏసీ రూ.26,500, సెకండ్ ఏసీ రూ.35,000ల ధరలను నిర్ణయించారు.

ప్యాకేజీ 2: ఐదు జ్యోతిర్లింగాల యాత్ర

ఈ ప్యాకేజీలో ఐదు జ్యోతిర్లింగాల యాత్రలను దర్శించుకునేలా రూపొందించారు. ఉజ్జయిని (మహాకాళేశ్వర్ – ఓంకారేశ్వర్), త్రయంబకేశ్వర్, భీమశంకర్, ఘృష్ణేశ్వర్‌లు దర్శించుకోవచ్చు. ఈ యాత్ర ఈనెల 05న ప్రారంభమై 13వ తేదీన సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, నాందేడ్, ముధ్ఖడ్, పూర్ణ మీదుగా వెళ్తుంది. ఒక్కొకరికి సాధారణ టికెట్ రూ.14,700, థర్డ్ ఏసీ రూ.22,900, సెకండ్ ఏసీ రూ.29,900లుగా ధరలను నిర్ణయించారు. యాత్రలకు వెళ్లే వారు 9701360701, 9281030712, 9281495845, 9281030749, 9281030750లకు సంప్రదించి టికెట్ బుక్ చేసుకోవాలన్నారు.

ధూమపానానికి దూరంగా ఉందాం

జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి



హాస్పిటల్‌లో మాట్లాడుతున్న అధికారులు

సంగారెడ్డి క్రైమ్: పొగాకు దూరంగా ఉండటంతో పాటు దానివెల్ల కలిగే దుష్పరిణామాలను ప్రతీ ఒకరికి అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్ఓ) గాయత్రీదేవి పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఇందిరానగర్‌లో శనివారం నిర్వహించిన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. పొగతాగడం అంటే జీవితానికి పొగ పెట్టుకోవడమేనన్నారు. సిగరెట్ తాగడం వల్ల గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులతో పాటు క్యాన్సర్, డయాబెటిస్, ఆస్టియోపొరోసిస్ వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. పొగాకు వల్ల సంభవించే వ్యాధులపట్ల చైతన్యం కలిగించేందుకు ప్రతీ ఏటా మే 31న 'వరల్డ్ నో టుబాకో డే'ను నిర్వహిస్తున్నారని చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు, అన్ని పాఠశాలలు, ఆ రోజు స్వచ్ఛందంగా ర్యాలీలు, సభలు, సమావేశాలు జరిపి ధూమపానం వలన కలిగే నష్టాలను అందరికీ తెలియజేయాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కమ్ సెక్రటరీ సంగారెడ్డి పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త!

- అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచన



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న సంజీవరెడ్డి

నారాయణఖేడ్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశముందని, వాటిని ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. నాగల్‌గిద్ద మండలం కరస్‌గుత్తి ప్రభుత్వాస్పత్రిని శనివారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలు, ఇన్, అవుట్ పేషంట్ల వివరాలను పరిశీలించారు. ఆస్పత్రిలో సరిపడా సిబ్బంది, వైద్యులు లేని విషయాన్ని సిబ్బంది ఎమ్మెల్యే దృష్టికి రాగా...సిబ్బంది కొరత వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్న విషయాన్ని వివరించారు. సిబ్బంది, వైద్యులు నియామకం కోసం మంత్రి ద్వారా కృషి చేస్తానని హామీనిచ్చారు. ఉన్న వైద్యులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ మారుమూల ప్రాంత ప్రజలకు సేవలు అందించాలని కోరారు.

త్వరలో మరో 10 బస్సులు!

ఖేడ్ ఆర్టీసీడిపోకు 30 కొత్తబస్సులు రావడంతో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఏర్పడిందని సంజీవరెడ్డి పేర్కొన్నారు. మంత్రి పొన్నంప్రభాకర్‌ను కోరగానే 30 కొత్తబస్సులను కేటాయించి పంపగా మరో 10 బస్సులను త్వరలో మంజూరు చేస్తామని హామీనిచ్చారని తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణంతో సంస్థకు ఆదాయం పెరిగిందన్నారు. బస్సుల సంఖ్య మెరుగైనందున అన్ని గ్రామాలకు బస్సు సర్వీసులను నడిపించాలని ఆదేశించారు. అంతకుముందు ఖేడ్ పట్టణంలో ఆయన కరస్‌గుత్తి నుంచి పటాన్‌చెరుకు, ఖేడ్ నుంచి కంగ్టి, జహీరాబాదులకు నైట్ హాల్ట్ బస్సులను ప్రారంభించారు.

పత్తి సాగుపై మొగ్గు

మద్దతు ధర పెంపుతో ఉత్సాహం

- ముందస్తు వర్షాలతో జోరుగా విత్తనాలు నాటుతున్న రైతులు





జహీరాబాద్ ప్రాంతంలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

జహీరాబాద్ టౌన్: వ్యవసాయాన్ని నమ్ముకుని జిల్లా రైతులు జీవనం సాగిస్తున్నారు. ప్రతీ ఏటా ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పంటలుగా పత్తి, వరి తదితర పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. ఈ ఏడాది రుతుపవనాలు రాకముందే విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. రెండు మూడేళ్లనుంచి నష్టపోతున్న లాభాలు వస్తాయన్న నమ్మకంతోపాటు ఈసారి పత్తి పంటకు మద్దతు ధర పెంచడంతో జిల్లాలో అధికమంది రైతులు పత్తి సాగువైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే ఆ దిశగా జిల్లా రైతులు విత్తనాలు నాటుతున్నారు.

ఆశల పల్లకీలోనే..

జిల్లాలో అధిక విస్తీర్ణంలో పత్తి పంటను వేస్తుంటారు. పత్తి సాగులో వరుస నష్టాలు వస్తున్నప్పటికీ అన్నదాతలు తమ ఆశలను వదులుకోవడం లేదు. తెగుళ్లకు మందులు, ఎరువులు, కూలీల ఖర్చుకు తోడు వర్షాలకు పంట దెబ్బతినడం వంటి కారణాలతో నష్టాలు చవిచూస్తున్నారు. ఈ సీజన్ అయినా బాగుంటే అప్పుల ఊబినుంచి బయట పడవచ్చని రైతులు ఎన్నో ఆశలతో ఈ పంట సాగుకు ఉద్యుక్తులవుతున్నారు. పెసర, మినుము ఇతర చిన్న చిన్న పంటలు సాగు చేయడం వల్ల పెద్దగా లాభాలు ఉండవని, సమయం కలిసొస్తే 'తెల్ల బంగారం'పంట పండి తమ కష్టాలు కడతేరుస్తుందని రైతులు ఆశిస్తున్నారు.

ఎంఎస్పీ పెంపుతో మరింత ఉత్సాహంగా

ఈ ఏడాది కేంద్రం పత్తి పంట మద్దతు ధర పెంచడంతో రైతులు మరింత ఉత్సాహంగా పత్తి పంటను సాగు చేస్తున్నారు. దీంతో గతేడాది కంటే ఈసారి పంట సాగు విస్తీర్ణం పెరగనుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 3.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఈ ఏడాది 3.87 లక్షల ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయ అధికారుల అంచనా వేస్తున్నారు. గతేడాది మాదిరిగా ఈ ఈసారి కూడా పత్తిదే అగ్రస్థానం అంటున్నారు.

ఈసారైనా పెట్టుబడులు వచ్చేనా?

పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టి పంటను అమ్ముకునే సమయంలో రైతులకు నిరాశ మిగులుతోంది. పంట దిగుబడులు తగ్గడంతోపాటు గిట్టుబాటు ధర లేక నష్టపోవలసి వస్తోంది. రైతులు దళారుల బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేసి సేకరిస్తుంది. గత ఏడాది సీసీఐ కేంద్రాల్లో పత్తికి మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 నిర్ణయించారు. ఈసారి పత్తి మద్దతు ధర కేంద్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.8,111కు పెంచింది. మద్దతు ధర కేంద్రం పెంచడంతో రైతులు పత్తి సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు.

తొందరపడి విత్తనాలు నాటొద్దు

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయి. పత్తి పంటను జూన్ నుంచి జూలై నెలాఖరు వరకు పత్తి విత్తుకోవచ్చు. ఒకటి రెండు తేలికపాటి జల్లులు పడిన వెంటనే తొందరపడి విత్త వద్దు. హైబ్రీడ్ రకాలను అనుభవం మీద ఎంపిక చేసుకోవాలి. సరైన జాగ్రత్తలు తీసుకుని సాగుచేస్తే అధికదిగుబడులు సాధించవచ్చు.

– భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్

క్లుప్తంగా

రోయింగ్ చాంపియన్ షిప్‌లో అభిజిత్ యాదవ్ ప్రతిభ



పోటీలో అభిజిత్ యాదవ్ టీమ్

హుస్నాబాద్: నేషనల్ రోయింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో హుస్నాబాద్‌కు చెందిన కాశబోయిన అభిజిత్ యాదవ్ మంచి ప్రతిభ సాధించి మెడల్స్ సాధించారు. హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్‌లో శనివారం జరిగిన 26వ సబ్ జూనియర్ నేషనల్ రోయింగ్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. 27 నుంచి 31వరకు నిర్వహించారు. ఈ పోటీల్లో 25 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. చాంపియన్ షిప్ పోటీల్లో అభిజిత్ యాదవ్ టీమ్ క్వార్టర్ ఫుల్ విభాగంలో గోల్డ్ మెడల్, డబుల్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు.

రాష్ట్ర స్థాయి పురస్కారానికి ప్రభుత్వ పాఠశాల ఎంపిక

5న అవార్డును అందుకోనున్న హెచ్ఎం



హెచ్ఎం రామకృష్ణ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాల రాష్ట్ర స్థాయి పర్యావరణ పురస్కారానికి ఎంపికైంది. 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణ ఈ అవార్డును అందుకోనున్నారు. హెచ్ఎం రామకృష్ణ పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషిని గుర్తించిన 'సాక్షి' గత నెల 3న 'పర్యావరణం.. బోధన వినూత్నం' అనే కథనాన్ని అందించడం జరిగింది. మారుమూల గ్రామంలోని తమ పాఠశాలలో చేస్తున్న కృషిని మొదట 'సాక్షి' గుర్తించినట్లు శనివారం హర్షం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో జీవాలు మృత్యువాత



మృతి చెందిన గేదె, కుక్క

నర్సాపూర్ రూరల్: విద్యుదాఘాతంతో జీవాలు మృత్యువాత పడిన ఘటన నర్సాపూర్ మండలం గొల్లపల్లిలో శనివారం చోటు చేసుకుంది. బాధితులు, గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామ శివారులోని పంట పొలాల్లో నెల రోజుల కిందట విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఈ క్రమంలో గ్రామానికి చెందిన సాకలి భాషయ్యకు చెందిన రెండు పాడి గేదెలు, ఒగ్గ రామునికి చెందిన పాడి గేదె, మరొకరి పెంపుడు కుక్క ఆ తీగలకు తగిలి విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాయి. మూడు పాడి గేదెల విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని గేదెల బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు. విద్యుత్ అధికారులపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య

జహీరాబాద్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జహీరాబాద్ మండలంలోని అల్లీపూర్ ఈద్గా శివారులో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ కాశీనాథ్ కథనం మేరకు.. కర్ణాటకలోని బీదర్ జిల్లాకు చెందిన ఎరిసన్ అనిల్‌కుమార్(30)భార్యతో గొడవపడి జీవితంపై విరక్తి చెందిన చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి అన్న బాలాజీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

భవన నిర్మాతలు

శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతీక అనంతగిరిపల్లి

- ఊరంతా మిల్లర్లు, మేస్త్రీలు, కార్మికులు
- వడివడిగా ఇళ్ల నిర్మాణాలు
- ప్రత్యేకత చాటుకుంటూ కలిసిమెలిసి పనులు
- ఏడాది పొడవునా ఉపాధి



మిల్లర్ యూనిట్‌తో స్లాబ్ వేస్తున్న కార్మికులు

వర్గల్(గజ్వేల్): అనంతగిరిపల్లి.. వర్గల్ మండలంలో ఇదో చిన్నపల్లెటూరు. ఈ ఊరి పేరు చెబితే చాలు మిల్లర్లు, మేస్త్రీలు, భవన నిర్మాణ రంగ కార్మికులే గుర్తొస్తారు. అనేక మంది గ్రామస్తులు దశాబ్దాల తరబడి భవన నిర్మాణరంగంలో కొనసాగుతూ, అదే వృత్తి, ప్రవృత్తిగా ఆ ఊరి ప్రత్యేకత చాటుతున్నారు. ఈ ఊరు సుప్రసిద్ధమైన నాచగిరి శ్రీలక్ష్మీనృసింహక్షేత్రంతో కలిసిపోయినట్లు ఉంటుంది. హల్దీ నది వాగు పరివాహకం కావడంతో నీటి లభ్యత దృష్ట్యా ఇక్కడి రైతులు వివిధ రకాల కూరగాయలు, వరి తదితర పంటలు సాగుచేస్తుంటారు. ఊరి జనాభా 1374, అందులో 1,086 మంది ఓటర్లు. స్వరాష్ట్రం సిద్ధించాక గ్రామ తొలి సర్పంచ్‌గా అప్పిడి సునీత ఏకగ్రీవంగా ఎన్నికవడం మరో ప్రత్యేకత. వ్యవసాయంతోపాటు, భవన నిర్మాణం తదితర రంగాల్లో ఇక్కడి జనం నిత్యం బిజీబిజీగా ఉంటారు.



అనంతగిరిపల్లి గ్రామ వ్యూ

మిల్లర్లు, మేస్త్రీల అడ్డా

పల్లెలో 15 మంది లిఫ్ట్ మిల్లర్లు ఉన్నారు. 60 మందికి పైగా సెంట్రింగ్ తాపీ మేస్త్రీలు ఉన్నారు. ఒక్కో మిల్లర్ వద్ద 15 మంది దాకా కార్మికులు పని చేస్తారు. అదే విధంగా ఒక్కో కాంట్రాక్టర్ కమ్ మేస్త్రీ గ్రూప్‌లో ఐదుగురు మేస్త్రీలు, 10 మంది లేబర్ ఉంటారు. మొత్తంగా ఊరంతా కలిపి 300 పైగా మిల్లర్లు, మేస్త్రీలు, లేబర్‌తో అనంతగిరిపల్లి గ్రామం భవన నిర్మాణ రంగ కార్మికుల అడ్డాగా ప్రాధాన్యత సంతరించుకుంది. దాదాపు సంవత్సరం పొడవునా కార్మికలోకానికి పని కల్పిస్తూ ఉపాధికి బాసటగా నిలుస్తుంది.

ట్రాక్టర్, మిల్లర్‌కు రూ.15 లక్షలు

భవన నిర్మాణంలో స్లాబ్ వేయడమే కీలకం. స్లాబ్ పోసేందుకు నిర్దేశిత మోతాదులో సిమెంట్, కంకర మిశ్రమం తయారీకి మిల్లర్ అవసరం. మిల్లర్ యంత్రంతోపాటు స్లాబ్ బాక్సులు, జాకీపైపులు, తదితర సామగ్రి ఖరీదు రూ.6 లక్షల వరకు ఉంటుంది. ఇంటి నిర్మాణాలు ఏ గ్రామంలో జరిగినా అక్కడికి లిఫ్ట్‌మిల్లర్లు, మేస్త్రీలు, లేబర్, మిల్లర్ యంత్రం, స్లాబ్ బాక్సులు, జాకీ పైపులు, తదితర సామగ్రిని ట్రాలీ ట్రాక్టర్‌లో తరలిస్తారు. ట్రాక్టర్ ట్రాలీ కొనేందుకు రూ.9 లక్షల వ్యయమవుతుంది. మొత్తం మీద లిఫ్ట్ మిల్లర్ కాం ట్రాక్టర్ కనీస పెట్టుబడి రూ.15 లక్షలు అవుతుంది. ఇలాంటి ట్రాక్టర్, లిఫ్ట్ మిల్లర్ యూనిట్ కలిగిన కాంట్రాక్ట్ మిల్లర్లు గ్రామంలో 15 మంది వరకు ఉన్నారు. వీరు ఇంటికి సంబంధించిన స్లాబ్ వేస్తారు.





భవన నిర్మాణ కార్మికులతో పని ప్రదేశానికి తరలుతున్న ట్రాక్టర్ మిల్లర్

సంఘటితత్వం చాటుకుంటూ..

భవన నిర్మాణంలో తమదైన పాత్రను పోషించే కాంట్రాక్టర్ మిల్లర్లు, కాంట్రాక్ట్ సెంట్రింగ్ మేస్త్రీలు, ఇతర మేస్త్రీలు అందరూ సంఘటితత్వం చాటుకుంటూ కలిసిమెలిసి ఉంటారు. తాము వేర్వేరు అనే భావనకు తావీయకుండా ఇంటి నిర్మాణ పనులు, లేబర్‌ను పరస్పరం పంచుకుంటారు. ఎక్కడైనా పని ఉన్నట్లు తెలిస్తే సమాచారం షేర్ చేస్తూ మరో మిల్లర్‌కు, సెంట్రింగ్ మేస్త్రీకి పని కల్పిస్తారు.



పనికి సిద్ధంగా ట్రాక్టర్ మిల్లర్ బృందం

సెంట్రింగ్ మేస్త్రీలు కీలకం

మిల్లర్లు, సెంట్రింగ్ మేస్త్రీల పని స్వభావంలో కొద్ది తేడాలు మినహా ఒకే విధంగా కనబడుతాయి. సెంట్రింగ్ మేస్త్రీలు స్లాబ్ కోసం సెంట్రింగ్ తీగల బిగింపు, బాక్సులు కొట్టడం తదితర పనులు నిర్వహిస్తారు. మిల్లర్లు అలా బిగించిన స్టీల్ స్ట్రక్చర్‌లో సిమెంట్, కంకర మిశ్రమంతో స్లాబ్ వేస్తారు. సెంట్రింగ్ మేస్త్రీ వద్ద కూడా 15 మంది వరకు లేబర్ ఉంటారు. పని ప్రదేశానికి సెంట్రింగ్ సామగ్రి, లేబర్ తరలింపునకు మేస్త్రీలు అద్దె వాహనాలు వినియోగిస్తుంటారు. ఇలాంటి యూనిట్ కలిగిన కంట్రాక్ట్ మేస్త్రీలు గ్రామంలో 10 మంది వరకు ఉండగా, వీరికి అనుబంధంగా మరో 50 మంది ఉన్నారు.

గృహమే కదా స్వర్గసీమ

ఇల్లి కట్టి చూడు..పెళ్లి చేసిచూడు అన్నది పెద్దలమాట. ఇంటి నిర్మాణం ఎంత కష్టతరమో ఆ మాట చెప్పకనే చెబుతుంది. గృహమే కద స్వర్గసీమ అంటారు.. అవును అనంతగిరిపల్లి భవన నిర్మాణరంగ మిల్లర్లు, సెంట్రింగ్ మేస్త్రీలు, కార్మికుల బ్యాచ్ రంగంలోకి దిగితే వడివడిగా ఇంటి నిర్మాణం పూర్తవుతుంది. మిల్లర్, మేస్త్రీలు వారివారి పనులు పూర్తి చేస్తేనే భవనానికి తుది రూపు వస్తుంది. స్వర్గం దిగొస్తుంది. గృహప్రవేశానికి బాటలు పడుతుంది.

ఇరవై ఏళ్ల అనుభవం



సెంట్రింగ్ మేస్త్రీగా ఇరవై ఏళ్ల అనుభవం ఉంది. చదరపు అడుగు(స్క్వేర్ ఫీట్) ప్రాతిపదికన, లేదా గుండుగుత్తగా ధర ఖరారు చేసుకొని ఇంటి నిర్మాణ పనులు చేపడుతాం. బేస్‌మెంట్, ఫుటింగ్, గోడల నిర్మాణం, సెంట్రింగ్, ప్లాస్టరింగ్ పనులు పూర్తి చేసేందుకు మూడు నుంచి ఆరు నెలలు పడుతుంది. నా దగ్గర ఐదుగురు మేస్త్రీలు, 10 మంది లేబర్ ఉంటారు. సగటున రోజుకు రూ.1,500 వరకు ఆదాయం సమకూరుతుంది. మా ఊర్లో చిన్నా పెద్ద 60 మంది దాకా సెంట్రింగ్ మేస్త్రీలు ఉన్నారు.

– తుమ్మల వెంకటేశ్, కాంట్రాక్టర్, సెంట్రింగ్ మేస్త్రీ

ఉద్యోగ ప్రయత్నం విఫలమై



నేను డిగ్రీ వరకు చదివా. ఎస్ఐ కావాలనే పట్టుదలతో రెండు సార్లు పరీక్ష రాశా. పోటీ తీవ్రత వల్ల సక్సెస్ కాలేకపోయా. దీంతో ట్రాక్టర్ కొనుగోలు చేసి మిల్లర్ కమ్ కాంట్రాక్టర్‌గా భవన నిర్మాణ రంగంలో కొనసాగుతూ 12 ఏళ్ల అనుభవం గడించా. మా ఊరిలో ఉంటూనే నాకు నేనుగా ఉపాధి కల్పించుకొని నెలకు సగటున రూ.50 వేలు ఆదాయం పొందుతున్న. నా దగ్గర పని చేసే మరో 15 మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న.

– కాయిత రవికుమార్, మిల్లర్, కాంట్రాక్టర్

భవన నిర్మాణ పనితో ఉపాధి



మాది అంతగిరిపల్లె. మా ఊరిలో శాన మంది మిల్లర్లు, సెంట్రింగ్ మేస్త్రీలు ఉన్నారు. ఊరిలో ఎటు సూసిన మిల్లర్ బండ్లు, ట్రాక్టర్లు కన్పిస్తాయ్. శాన మంది రోజుకూలీ లెక్క భవన నిర్మాణ పనులకు వెళ్తుంటారు. లేబర్‌తోని కలిసి నేను కూడా వెళ్తా. రోజు రూ.500 దాకా వస్తయ్. పని కాడనే భోజనం చేస్తం. మాకు రోజు ఉపాధి దొరుకుతుంది. వచ్చే నాలుగు రూపాయలు కుటుంబానికి ఆసరైతయ్.

– కుమ్మరి నాగమణి, లేబర్

నలుగురికి పని



భవన నిర్మాణ రంగంలో 28 ఏళ్ల అనుభవం మెలకువలు నేర్పింది. మిల్లర్ నిర్వాహకుడిగా, కాంట్రాక్టర్‌గా నేను, నా కుమారుడితో పాటు ఉపాధి పొందుతున్న. 14 మందికి పైగా లేబర్‌కు ఉపాధి కల్పిస్తున్న. ఊరిలో భవన నిర్మాణ రంగ మిల్లర్లు, మేస్త్రీలు అంతా కలిసిపోయి ఉంటాం. సైట్లు కూడా పంచుకుంటాం. మేమంతా కలిసి ఊర్లే 300 మంది లేబర్‌కు ఉపాధి కల్పిస్తుండడం సంతృప్తి కలిగిస్తుంది. పని పాట ఉంటే జనం.. ఊరు బాగుంటుంది. కష్టమైనా, నష్టమొచ్చినా ఎంచుకున్న వృత్తి వదలబోను.

– తుమ్మల పెంటయ్య, మిల్లర్,కాంట్రాక్టర్

మహిళలను రాజకీయాల్లో ప్రోత్సహించాలి

- మొఘలులను ఎదురించిన వీరనారి అహల్యాబాయి
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ కలెక్టరేట్: వీరనారి అహల్యాబాయి హోల్కర్‌ను ఆదర్శంగా తీసుకొని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలను ప్రోత్సహించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పుణ్యశ్లోక లోకమాత మహారాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతిని ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కవితా రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై అహల్యాబాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహారాష్ట్రకు చెందిన రాణి అహల్యాబాయి హోల్కర్ భర్త చనిపోయినప్పటికీ వీరనారిగా నిలబడిన మొఘలులను ఎదురించి పోరాడినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు ఎంఎల్ఎన్‌రెడ్డి, శ్రీనివాస్, సీనియర్ నాయకులు సుభాష్ గౌడ్, మాజీ సర్పంచ్ రాజేందర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మహిళలు పాల్గొన్నారు.

దండయాత్రలకు బీజేపీ భయపడదు

గజ్వేల్‌రూరల్: ప్రధాని మోడీ సాహసోపేత నిర్ణయాలతో ముందుకు సాగుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాలన సాగిస్తున్నారని, ఎవరెన్ని దండయాత్రలు చేసినా బీజేపీ భయపడదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. గజ్వేల్‌లో లోకమాత అహిల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది జయంతి ముగింపు ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని క్యాసారం చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఆమె విగ్రహానికి రఘునందన్‌రావుతోపాటు చిన్మయ మిషన్ స్వామి యజ్ఞానంద, సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు, రాష్ట్ర మహిళా కన్వీనర్ రుక్మిణి, సహ కన్వీనర్ నందాదేవి వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ చేపట్టారు. రఘునందన్‌రావు మాట్లాడుతూ 300 ఏళ్ల క్రితమే మహిళల హక్కుల కోసం అహిల్యా బాయి పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, నాయకులు నందన్‌గౌడ్, సింగం సత్తయ్య, ఎల్లు రాంరెడ్డి, సంతోష్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్, బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, మండల శాఖ అధ్యక్షుడు అశోక్‌గౌడ్‌తోపాటు నాయకులు మహేశ్, సురేశ్ తోపాటు వివిధ మండలాల అధ్యక్షుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్ట పగలే దొంగతనం

కంది(సంగారెడ్డి): మండల కేంద్రమైన కందిలో పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడ్డారు. రూరల్ ఎస్సై రవీందర్ కథనం మేరకు.. కందికి చెందిన జగదీశ్వర్ కుమారుడు భార్యతో కలిసి శుక్రవారం ఉదయం హైదరాబాద్ వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ముసుగు ధరించిన వ్యక్తి ఇంట్లోకి చొరబడి తులం బంగారం, వెండి పూజ సామగ్రితోపాటు కొంత నగదును దోచుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవీందర్ ఆధ్వర్యంలో క్లూస్ టీమ్‌తో ఆధారాలను సేకరించారు. సీసీ ఫుటేజీలను పరిశీలించినట్లు పేర్కొన్నారు.

పలు దేవాలయాల్లో..

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో గుర్తు తెలియని దుండగులు చోరీలకు పాల్పడ్డారు. నార్లాపూర్ గ్రామంలోని ఎల్లమ్మ దేవాయలంలో హుండీ పగులగొట్టి డబ్బులను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. అలాగే, వెంకటాపూర్ (కె) గ్రామంలోని పెద్దమ్మ దేవాలయంలో, కల్వకుంట గ్రామంలోని ఎల్లమ్మ, పెద్దమ్మ దేవాలయాల్లో హుండీలను పగులగొట్టి నగదు చోరీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు క్లూస్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ విషయమై పోలీస్‌లు కేసు నమోదు చేశారు.

తాళం వేసిన ఇంట్లో..

వెల్దుర్తి(తూప్రాన్): తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని మంగళపర్తి గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మ్యాదరి నర్సింలు, భార్యాపిల్లలతో కలిసి బుధవారం జిన్నారంలో బంధువుల ఇంటికి వెళ్లగా తల్లి యాదమ్మ సంగారెడ్డికి వెళ్లింది. శనివారం ఉదయం నర్సింలు ఇంటికొచ్చేసరికి ప్రధాన తలుపులకు తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూసేసరికి బీరువాలోని వస్తువులు, బట్టలు చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో ఉంచిన రూ.45 వేలు నగదును దుండగులు దోచుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

కృషి విజ్ఞాన కేంద్రం తునికి శాస్త్రవేత్తలు

దుబ్బాకటౌన్: రైతులు ఆధునిక పద్ధతులను పాటిస్తూ.. రసాయన మందుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం తునికి శాస్త్రవేత్త డా.రవి, సీఆర్ఐడీఏ శాస్త్రవేత్త డా.శరత్ చంద్రన్, ఎన్ఏఏఆర్ఎం శాస్త్రవేత్త డా.పీసీ మీన అన్నారు. శనివారం రాయపోల్ మండల కేంద్రం, తిమ్మక్ పల్లి గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు పర్యటించి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు వానాకాలం సమాయత్తం, విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బిల్లుల ప్రాముఖ్యత గురించి వివరించామన్నారు. మండలంలోని ఫర్టిలైజర్ దుకాణదారులు ఇష్టానుసారంగా విత్తనాలు, ఎరువులు విక్రయిస్తున్నారని, అమ్మినవాటికి బిల్లులు ఇవ్వడం లేదని, ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తున్నారని, స్టాక్ ఉన్న ఎరువులు విత్తనాలను అమ్ముతున్నారని రైతులు మండిపడ్డారు. మండలానికి శాస్త్రవేత్తల బృందం వస్తే రైతులకు సరైన సమాచారం అందించడంలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఓ నరేశ్, ఏఈఓ రజిత, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నందగోకుల్, కల్వకుంట గ్రామాల్లో..

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందగోకుల్, కల్వకుంట గ్రామాల్లో శనివారం కృషి విజ్ఞాన కేంద్రం, మెదక్ వారి ఆధ్వర్యంలో వీక్షిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చిన్న బాబు నాయక్ మాట్లాడుతూ.. వానాకాలం పంటల నిర్వహణ పద్ధతుల గురించి వివరించారు. నీటి నిర్వహణ పద్ధతులు, తెగుళ్ల నిర్వహణ గురించి శాస్త్రవేత్త డాక్టర్ జేసుదాస్ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం, తునికి శాస్త్రవేత్త డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. రైతుల ప్రయోజనం కోసం వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారిణిలు శ్రీలత, మౌనిక, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఎఫ్‌పీఓ సీఈఈ సురేశ్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

బిర్యానీలో చనిపోయిన బల్లి

సంగారెడ్డి పట్టణంలో ఘటన

సంగారెడ్డి: వేడివేడి బిర్యానీ తిందామని దాబాకు వెళ్లిన యువకులకు బిర్యానీలో చనిపోయిన బల్లి దేహం కనిపించింది. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు పట్టణంలోని కింగ్స్ దాబాకు మంగళవారం రాత్రి బిర్యానీ తినడానికి వెళ్లారు. బిర్యానీ తినే సమయంలో అందులో ఎప్పుడో చనిపోయిన బల్లి దేహం ప్రత్యక్షమవడంతో ఒక్కసారిగా కంగుతిన్నారు. వెంటనే హోటల్ యాజమాన్యాన్ని నిలదీయగా నచ్చజెప్పి పంపించేశారు. ఇటీవలె ఇదే కింగ్స్ దాబాలో తనిఖీలు చేసిన అధికారులు కుళ్లిన మాంసం, పాడైన



ఫ్లేవర్లు వాడుతున్నారని నోటీసులు ఇచ్చారు. అయినా నిర్వాహకులు తమ తీరును మార్చుకోవడం లేదని అక్కడికి వెళ్లే కొందరు వాపోతున్నారు. ఈ విషయమై జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారికి ఫోన్ చేయగా ఆమె అందుబాటులోకి రాలేదు.

మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

టీఎంఈఎస్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌యాదవ్



మాట్లాడుతున్న ప్రభాకర్‌యాదవ్, వెంకటగోపాల్

గజ్వేల్‌రూరల్: రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని టీఎంఈఎస్(తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ సెంట్రల్)ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటగోపాల్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం గజ్వేల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కావడంతో కొత్తగా మున్సిపాలిటీలు ఆవిర్భవించగా గత ప్రభుత్వం సరిపడా ఉద్యోగులను కేటాయించకపోవడంతో ప్రస్తుతం పని చేస్తున్న వారిపై పనిభారం పడిందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రతీ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 152 మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, అంతేగాకుండా 93జీవో ద్వారా తమకు అన్యాయం జరిగిందని హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని, సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలని మున్సిపల్ ఉద్యోగ జేఏసీ తరఫున కోరుతున్నామన్నారు. టీఎంఈఎస్ ఫోరమ్ అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్, నాయకులు నర్సయ్య, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

రామాయంపేట(మెదక్): కాలినడకన తండాకు వెళ్తున్న గిరిజన వ్యక్తిపై ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. ఈ ఘటన శనివారం రాత్రి మండలంలోని సదాశివనగర్ తండా సమీపంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. తండాకు చెందిన జాట్రోత్ హనుమంతు అటవీ ప్రాంతంగుండా కాలినడకన తండాకు వెళ్తున్నాడు. చెరువు అలుగు ప్రాంతంలో ఎలుగుబంటి ఒక్కసారిగా హనుమంతుపై దాడి చేసి గాయపర్చింది. హనుమంతు భయంతో అరుస్తూ చేతిలో ఉన్న కర్రతో ఎలుగుబంటిని కొట్టగా అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. బాధితుడు ఫోన్ ద్వారా తండావాసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలికి చేరుకొని అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అటవీశాఖ బీట్ అధికారి లక్ష్మణ్ బాధితుడిని పరామర్శించారు. ఆర్థిక సహాయం అందజేస్తామని అటవీ రేంజీ అధికారి విద్యాసాగర్ పేర్కొన్నారు.

డబ్బుల కోసమే మహిళ హత్య

- కేసును ఛేదించిన పోలీసులు
- క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకున్న యువకుడు
- మళ్లీ పొందేందుకు మహిళను చంపి డబ్బులు, నగదుతో పరారీ
- వివరాలు వెల్లడించిన జహీరాబాద్ డీఎస్పీ సైదా

న్యాల్‌కల్(జహీరాబాద్): క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డ ఓ యువకుడు డబ్బులు పోగొట్టుకున్నాడు.. తిరిగి ఎలాగైనా ఆ డబ్బులు పొందేందుకు ఒంటరిగా ఉన్న మహిళను హత్య చేశాడు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న నగలు, డబ్బులతో పరారయ్యాడు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో 25న జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. శనివారం హత్యకు సంబంధించిన వివరాలు జహీరాబాద్ డీఎస్పీ సైదా వెల్లడించారు. రుక్మాపూర్ గ్రామానికి చెందిన బోయిని ప్రశాంత్ (21), ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో కొద్ది రోజుల నుంచి ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి డబ్బులు పోగొట్టుకున్నాడు. ఆ డబ్బులను పొందేందుకు దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇంటి పక్కనే ఒంటిరిగా ఉన్న రాణేమ్మ ఇంట్లో దొంగతనం చేయాలనుకొని 25న రాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఒంటరిగా నిద్రిస్తున్న రాణెమ్మ ఇంటికి వెళ్లి తలుపు తట్టాడు. నిద్రలోంచి బయటకు వచ్చిన మహిళను బయటకు ఈడ్చుకొచ్చాడు. ఒకరినొకరు తోసుకోవడంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. కోపంతో రాణెమ్మను ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. అనంతరం ఆమెను ఇంట్లోకి తీసుకెళ్లి మంచంపై పడుకోబెట్టాడు. నగదుతో పాటు మృతురాలి మెడలో ఉన్న బంగారు గుండ్లు, పుస్తెల తాడు తీసుకొని పరారయ్యాడు. కేసు దర్యాప్తులో భాగంగా శనివారం ఉదయం పోలీసులు గ్రామానికి వెళ్లి పలువురిని విచారించారు. మృతురాలి ఇంటి పక్కనే ఉన్న ప్రశాంత్ ఇంటికి వెళ్లారు. అతని చేతికి అయిన గాయాలను చూసి అనుమానంతో విచారించగా నిజం ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. కేసును త్వరగా ఛేదించిన జహీరాబాద్ రూరల్ సీఐ హన్మంత్, ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది ఓందేవ్, అస్లాం, ఆనంద్, హరినేత్ర, రవికుమార్, రాజశేఖర్, సుభాష్‌లను డీఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సైదా